క్లుప్తంగా

విగ్రహాల పునఃప్రతిష్ట వేడుకలు ప్రారంభం



హోమం చేస్తున్న అర్చకులు

మధురవాడ: మధురవాడ శ్రీ సిద్ధేశ్వర స్వామి పీఠంలో శ్రీ కోదండ రామస్వామి విగ్రహాల పునః ప్రతిష్ట మహోత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, అనంతరం హోమం, ఇతర పూజలు చేశారు. 20న ఉదయం 10.11 గంటలకు యంత్ర, విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. అనంతరం శ్రీ సీతారామ చంద్రస్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తామని, భక్తులంతా పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

80 మందికి కంటి పరీక్షలు



కంటిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో మంగళవారం విశ్వనాథ ఫార్మా స్యూటికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో 80 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అందులో 10 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో వైద్యులు నిఖిత, సత్యవతి, క్యాంప్ కో – ఆర్డినేటర్ వై.పైడిరాజు, ఎన్ఎస్ఎస్ పీవో సమన్వయి, తదితరులు పాల్గొన్నారు.

బయో మెడికల్ రీసెర్చ్‌పై సదస్సు

కొమ్మాది: గీతం వర్సిటీలో ఏర్పాటు చేసిన మల్టీ డిసిప్లీనరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్సిలేషన్ ఇనిషియేటివ్స్ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో బయోమెడికల్ పరిశోధనలపై సదస్సును వీసీ దయానంద సిద్ధవట్టం మంగళవారం ప్రారంభించారు. ప్రపంచ స్థాయి పరిశోధనలు నిర్వహించాలనేది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రోటియోమిక్స్, మెటబాలోమిక్స్ వంటి విశ్లేషణలను మాస్‌స్పెక్ట్రోమెట్రి ఎలా వినియోగించాలో తెలియజేశారు. అధ్యాపకులకు ఈ సదస్సు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు.

కూలిన ఇంటి సన్‌షేడ్



కూలిపోయిన ఇంటి సన్‌షేడ్

ఆనందపురం : మండలంలోని పాలవలసలో మంగళవారం ఓ ఇంటి సన్‌షేడ్ అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. మంగళవారం మధ్యాహ్నం గెద్ద లక్ష్మికి చెందిన ఇంటి ముందు భాగంలో గల సన్‌షేడ్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో పిట్టగోడ ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వీఆర్వో శ్రీనివాసరావు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

కార్యకర్తల సమావేశం నేడు

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

అందరికీ మెరుగైన వైద్య సేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు



పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉమావతి



నగరపాలెం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు

తగరపువలస: సచివాలయం పరిధిలోని ప్రజలందరికీ వైద్య ఆరోగ్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. భీమిలి మండలం టి.నగరపాలెం సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఎక్కడా రాజకీయ నాయకులు, పార్టీల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. పంచాయతీ ప్రజలంతా తనిఖీలు చేయించుకుని అవసరమైన వారు మందులు తీసుకునేలా సేవాభావంతో ప్రోత్సహించాలన్నారు. అంతకు ముందు శిబిరాన్ని డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రమావతి సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. 426 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి నలుగురిని రిఫరల్ ఆస్పత్రులకు సిఫారసు చేసినట్టు తాళ్లవలస పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లిఖార్జునరావు తెలిపారు. శిబిరంలో వైద్యులు శోభారాణి, స్పెషలిస్ట్ వైద్యులు సంజన, అనూహ్య, సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది రమణకుమారి, స్వాతి తదితరులు పాల్గొని సేవలు అందించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



అరటిపండ్ల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి, పువ్వులు, తులసి మాలల అలంకరణలో రాస పోలమాంబ, పువ్వులు, చీరలు, గాజుల అలంకరణలో పైడితల్లమ్మ అమ్మవారు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం అరటిపండ్లతో అలంకరించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు బర్ల బంగారయ్య, నారాయణమ్మ సహాయ సహకారాలు అందించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు అమ్మవారిని అలంకరించారు.

భీమిలి మండలం మజ్జివలసలో రాస పోలమాంబను ఐదు రకాల పువ్వులు, తులసి మాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన తుపాకుల అచ్చన్న, దేవి దంపతులు సహకరించగా తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. చిట్టివలస మైలపల్లి, మేకల వారి కళ్లాల్లో పోలిపల్లి పైడితల్లమ్మను గాజులు, చీరలు, పూలదండలతో మాజీ సైనికుడు మేకల శ్రీను తదితరులు అలంకరించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్సు



తాటితూరు నుంచి ఆర్టీసీ బస్సులో పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులు

తగరపువలస : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులను కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు వరంలా మారిందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల ప్రాంతానికి చెందిన భీమిలి మండలం తాటితూరు పంచాయతీకి ప్రస్తుతం ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఇక్కడి ప్రజలు ఆటోలపై ఆధారపడి రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి పంచాయతీలో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 40 మంది విద్యార్థులు భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సి వుంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉచిత బస్సు సదుపాయం కల్పించింది. దీంతో తాటితూరు పంచాయతీలో ఉదయం 7.45కు విద్యార్థులతో బయలుదేరిన బస్సు పరీక్షా కేంద్రాలకు చేరవేసి తిరిగి పరీక్ష పూర్తయిన తర్వాత వారిని పంచాయతీ కూడలిలో దించుతోంది. దీంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి, ఆర్టీసీ యాజమాన్యానికి మంగళవారం ధన్యవాదాలు తెలియజేశారు.

రెండో రోజు 19 మంది గైర్హాజరు

ఆనందపురం : మండలంలోని ఐదు కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు మంగళవారం 19 మంది విద్యార్థులు హాజరు కాలేదు. ఆనందపురం ఏ కేంద్రంలో ముగ్గురు, బి కేంద్రంలో ఆరుగురు, పెద్దిపాలెం నారాయణ స్కూల్ కేంద్రంలో ముగ్గురు, శొంఠ్యాం కేంద్రంలో ఐదుగురు, బోయిపాలెం కేంద్రంలో ఇద్దరు చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి తెలిపారు.

మహారాష్ట్ర పార్థీ గ్యాంగ్ పనే

- సత్యనారాయణపురం ఘటనపై పోలీసుల అనుమానం
- వేలిముద్రల సాయంతో ఒకరి గుర్తింపు
- అనుమానితుల ఫొటోలు విడుదల



వేలిముద్రల ఆధారంగా పోలీసులు గుర్తించిన ఆగంతకుడు



పోలీసులు అనుమానిస్తున్న ఆగంతుకులు

పద్మనాభం: మండలంలోని ఐనాడ పంచాయతీ సత్యనారాయణపురంలో యారబాటి రమణమూర్తి ఇంటిలో ఈ నెల 17న రాత్రి జరిగిన ఘటన మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ పనిగా పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. యారబాటి రమణమూర్తి కుమారుడు లక్ష్మీ భరద్వాజ్ భార్య మనీషా ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. దీంతో ఆమె ఆ రోజు ఆలస్యంగా నిద్రకు ఉపక్రమించారు. మనీషా, భరద్వాజ్ ఒక గదిలో, భరద్వాజ్ తల్లిదండ్రులు మరో గదిలో నిద్రపోయారు. ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో నలుగురు ఆగంతకులు తలుపునకు రంధ్రం చేసి ఇంటిలోకి ప్రవేశించారు. టార్చ్‌లైట్ కాంతితో డోర్ కర్టన్ నుంచి చూస్తుండడంతో... అప్పటికి మెలకువుగా వున్న మనీషా అనుమానంతో భర్త భరద్వాజ్‌ను నిద్ర లేపింది. ఆగంతకులను చూసిన భరద్వాజ్ వెంటనే ఎవరని బిగ్గరగా అరవడంతో మరో గదిలో వున్న తల్లిదండ్రులు కూడా నిద్రలేచారు.

ఆ సమయంలో భరద్వాజ్(25) తల, చేతిపై దుండగులు ఇనుప రాడ్‌తో కొట్టారు. తల్లి శారదను గాయపరిచి అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన భరద్వాజ్‌కు ఏడు కుట్లు పడ్డాయి. దీనిపై మనీషా ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆగంతకులు మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ సభ్యులుగా పోలీసులు అనుమానిస్తున్నారు. వేలిముద్రలు ఆధారంగా ఒకరిని ఇప్పటికే గుర్తించినట్లు తెలిసింది. అనుమానితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. వీరి పట్ల గ్రామాల్లో జాగ్రత్తగా వుండాలని సూచించారు.

చెడ్డీ గ్యాంగ్‌తో అప్రమత్తత అవసరం



తాళ్లవలసలో అనుమానితుల ఫొటోలతో అవగాహన కలిగిస్తున్న క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్

తగరపువలస : పద్మనాభం మండలం అయినాడలో ఈ నెల 17న చెడ్డీ గ్యాంగ్ ముఠా ఒక ఇంట్లో ప్రవేశించి దాడి చేసిన సంఘటనతో భీమిలి పోలీసులు అప్రమత్తమయ్యారు. మహారాష్ట్రకు చెందిన అనుమానితులుగా పేర్కొన్న వారి ఫొటోలతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వీరిని గుర్తిస్తే వెంటనే సమాచారమివ్వాలని క్రైం ఎస్ఐ సూర్యప్రకాష్ కోరారు. అనుమానితులకు ఆశ్రయం ఇవ్వకూడదన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. పెళ్లిళ్లు, పండగలకు రక్షణ లేకుండా ఆభరణాలు వేసుకుని వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచొద్దని సూచించారు.

ఫొటోల తొలగింపులో అధికారుల వివక్ష



టి.నగరపాలెం సచివాలయంలో పై వరుసలో పాత సర్పంచ్‌ల ఫొటోలు

తగరపువలస : ఎన్నికల నిబంధనల పేరుతో భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామ సచివాలయంలో అధికారులు వివక్షతో వ్యవహరించారు. ప్రస్తుత సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి ఫొటో తొలగించి... మాజీ సర్పంచ్‌ల ఫొటోలు అలాగే వుంచేశారు. సచివాలయ ప్రారంభోత్సవ సమయంలో ఈ పంచాయతీకి గతంలో సేవలు అందించిన ఆరుగురు సర్పంచ్‌ల ఫొటోలు ఏర్పాటు చేశారు. వీరిలో ముగ్గురు చనిపోగా మిగిలిన ముగ్గురు బతికే వున్నారు. ఈ ముగ్గురు కాంగ్రెస్, టీడీపీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరురాలైన ప్రస్తుత సర్పంచ్ ఛాయా గౌతమి ఫొటో తొలగించి కాంగ్రెస్, టీడీపీలకు అనుకూలంగా వ్యవహరించే మాజీ సర్పంచ్‌ల ఫొటోలు సచివాలయంలో వుంచడం చర్చనీయాంశమైంది. అధికారుల వివక్షకు మచ్చుతునకగా ఈ సంఘటన నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు.

సిద్ధమవుతున్న ఎగువపేట వేదిక



నిర్మాణం చివరి దశకు చేరుకున్న వేదిక

భీమునిపట్నం: భీమిలిలో ఎగువపేట సమీపంలో కొత్తగా చేపట్టిన వేదిక నిర్మాణం పూర్తికావస్తుండడంతో కొద్ది రోజుల్లో అందుబాటులోకి రానుంది. మత్స్యకారులు నివసించే ఎగువపేట, దగ్గరలోని బోయివీధితోపాటు చుట్టుపక్కల వారి కోసం 30 సంవత్సరాల క్రితం ఇక్కడ వేదిక నిర్మించారు. ఇక్కడ ప్రతి సంవత్సరం గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు వేదిక పైనే జరిగేవి. దీంతోపాటు ఇతర పండగలు, శుభకార్యాలు నిర్వహిస్తుండేవారు. అయితే ఆ వేదిక శిథిలమైపోవడంతో గత పాలకులను స్థానికులు వేడుకున్నా మరమ్మతులు చేపట్టలేదు. కనీసం స్పందించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేదిక దుస్థితిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు కొత్త వేదిక నిర్మాణానికి అధికారులతో అంచనాలు రూపొందించి, అవసరమైన రూ.20 లక్షలు వెంటనే మంజూరు చేయించారు. దీంతో కొద్ది రోజుల క్రితం కొత్త వేదిక నిర్మాణ పనులు ప్రారంభమై వేగంగా జరుగుతూ చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే వేదిక అందుబాటులోకి రానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధించాలి

తగరపువలస : రెండేళ్ల క్రితం జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్లాస్టిక్ నిషేధం నీరు కారిపోయిందని నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న ఆరోపిస్తూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తి స్థాయిలో నిషేధం అమలు కానందున పర్యావరణానికి హాని కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక కౌంటర్లు ద్వారా నార, గుడ్డ సంచులు అందుబాటులో వుంచాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన కోసం స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకోవాలన్నారు. అవసరమైతే తనిఖీలు విస్తృతం చేసి జరిమానా విధించడం, ట్రేడ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని ఆయన కోరారు.

తగరపువలసలో కుండపోత వర్షం



తగరపువలసలో కురుస్తున్న వర్షం

తగరపువలస: భీమిలి నియోజకవర్గం పరిధిలో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంటున్నరపాటు వర్షం కురవడంతో స్థానిక ప్రజలు ఉపశమనం పొందారు. డ్రైనేజీలు, రహదారులు వర్షం నీటితో నిండి ప్రవహించాయి. ఉదయం కూడా జల్లులతో కూడిన వర్షం కురిసినప్పటికీ వెంటనే ఎండ కాయడంతో పలువురు ఉక్కపోతకు గురయ్యారు. అకాల వర్షానికి వ్యాపారులు, కూలిపనులు చేసుకునే వారు ఇబ్బందులు పడ్డారు. ఎండిపోతున్న దశలో ఉన్న కూరగాయలు, ఆకుకూరలు, మొక్కజొన్న వంటి పంటలకు ఊపిరిపోసినట్టు అయింది. ఈ నెల 26 వరకు వర్షాలు కురుస్తాయని ప్రచారం జరుగుతుండటంతో చెరువులు, గోస్తనీ నదిలో నీరు చేరే అవకాశం ఉంది.

సింహగిరిపై విశేషంగా హోమం



ప్రధాన కలశతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు.అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అర్చకులు చిన్నా తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా రథాల ఊరేగింపు



రథాలు ఊరేగిస్తున్న భక్తులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సురాల వారి ఇలవేల్పు పరదేశమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథాల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం, ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్‌దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 23న సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.1,500 రుసుం చెల్లించిన దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని చెప్పారు.

శోభన్‌బాబు చిత్ర గీతాల విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంచర్ల అచ్యుతరావు తదితరులు

దాబాగార్డెన్స్: ఈ నెల 21న నటభూషణ్ శోభన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకుని శోభన్‌బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. దాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రాల కథానాయకుడు శోభన్‌బాబు స్మారకార్థం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు ప్రజాదరణ పొందిన గీతాలు ఆలపించనున్నారని చెప్పారు. శోభన్‌బాబు వీరాభిమాని కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.